## క్లుప్తంగా

### కొనసాగుతున్న సదరం ప్రత్యేక క్యాంప్



**తెనాలిఅర్బన్:** తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఉదయం 8.30 గంటలకే దివ్యాంగులు జిల్లా వైద్యశాలకు చేరుకుని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాంపు జరిగింది. 100 మంది కంటి, 50 మంది వినికిడికి సంబంధించిన పరీక్షలు చేయించుకున్నట్లు అధికారులు తెలిపారు. క్యాంప్‌లో నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ డాక్టర్ ఎం.చంద్రబాబు, సత్తెనపల్లి నుంచి వచ్చిన డాక్టర్ మాధురిలు, బాపట్ల నుంచి వచ్చిన అప్తామాలజీ డాక్టర్ ఆషాకిరణ్, నర్సారావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎస్.హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు.

### తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం



**తెనాలి:** వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలను తెనాలికి చెందిన పలువురు కవులు స్వీకరించారు. వీరిలో తెనాలికి చెందిన కవి రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ) కూడా ఉన్నారు. శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి వీరిని సత్కరించారు. సత్కార గ్రహీతను పలువురు అభినందించారు.

### దేశభక్తి కలిగి ఉండాలి




**తెనాలి:** రిపబ్లిక్ డే దినోత్సవాన్ని పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 26వ తేదీవరకు భరతమాత పూజలు నిర్వహిస్తున్నట్లు తెనాలి సబ్ డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్ కుమార్ తెలియజేశారు. రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని కోదండరామ సేవిక ధర్మ సమాజం (దాసకుటి)లో గురువారం భరతమాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు ముఖ్యఅతిథిగా జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు హాజరయ్యారు. ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు. గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. దేశభక్తిని మనసులో నింపుకొనే విధంగా భరతమాత పూజలు నిర్వహించాలని సూచించారు. భక్తులు,విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఘనంగా నేతాజీ జయంతి



**తెనాలి:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం రూరల్ మండల గ్రామం అంగలకుదురులో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని విశ్వవేద స్కూలు విద్యార్థులు పాల్గొని నేతాజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బీజేపీ నాయకులు కడియాలనంద కిషోర్, కనగాల శ్రీనివాస్, కనగాల హరి, సరిపూడి తాతారావు, మనుబోతుల వీరయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నేతాజీ త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులకు ఆయన గొప్పతనాన్ని వివరించారు. దేశ రక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని తెలియజెప్పారు.


### పంచాయతీ ఆస్తుల ఆక్రమణపై వినతి



**తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల):** దుగ్గిరాల మండల పరిధిలోని పెరుకలపూడిలో గ్రామ పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తున్నారని సర్పంచ్ గంపల గంగాధర్ యాదవ్ గురువారం జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాయికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 2021 ఫిబ్రవరి 9న పంచాయతీ సర్పంచ్‌గా చెరువులు, పంచాయతీ స్థలాల ఆక్రమణలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు మళ్లీ చెరువు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు.పెరుకలపూడిలో ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పంచాయతీ ఆస్తులను కాపాడి గ్రామ స్వరాజ్యానికి తోడ్పడాలని కోరారు.

# తెలుగు సినిమాకి అదృష్టదీపుడు

- ప్రముఖ సినీ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావుది తెనాలి సమీపంలోని రావికంపాడు స్వస్థలం
- అదృష్టదీపుడు చిత్రంతో సినీరంగ ప్రవేశం
- దాదాపు 500 చిత్రాల్లో వైవిధ్యభరిత పాత్రల్లో ఒదిగిపోయిన వైనం
- 26న గుమ్మడి వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..



గుమ్మడి వెంకటేశ్వరరావు



రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్న సందర్భంగా గుమ్మడికి తెనాలిలో జరిగిన సత్కార సభలో పాల్గొన్న మిక్కిలినేని, ధూళిపాళ్ల, నాగభైరవ కోటేశ్వరరావు(ఫైల్)

**తెనాలి:** గుమ్మడిగా తెలుగు ప్రేక్షకులకు చిరపరిచితుడైన గుమ్మడి వెంకటేశ్వరరావు జీవితం 80 రీళ్ల సినిమా కథే. ప్రతి రీలులోనూ ఎన్నో మలుపులు. నటనలోనే కాదు, వ్యక్తిత్వంలోనూ వంకపెట్టేందుకు వీల్లేని నెలవంక ఆయన. చిన్నతనంనుంచీ తన జీవితాన్ని నిర్మించుకున్న తీరు, పాత్రల్లో వ్యక్తిత్వాన్ని ప్రతిఫలించుకున్న విధానం గొప్పది. తామరాకుపై నీటిబొట్టులా పరిశ్రమలో మెలిగిన స్థితప్రజ్ఞుడు. అన్నింటికీ మించి తెలుగు సినిమాకు 'అదృష్టదీపుడు' అనొచ్చు. ఈనెల 26న ఆయన వర్ధంతి సందర్భంగా స్మరించుకుందాం.

### రావికంపాడు సొంతూరు

గుమ్మడి వెంకటేశ్వరరావు స్వస్థలం తెనాలి సమీపంలోని రావికంపాడు. 1928 జులై 9న జన్మించారు. కొల్లూరు హైస్కూలు, గుంటూరు హిందూ కాలేజీలో చదివారు. ఊళ్లోని లైబ్రరీ ఆయన్ను పుస్తకాల పురుగును చేసింది. 1942లో తొలిసారిగా రంగస్థలంపై నాటకంలో వృద్ధ పాత్రలో నటించారు. 1950లో 'అదృష్టదీపుడు' సినిమాతో వెండితెర నడక ఆరంభించారు. అది మొదలు ఆరు దశాబ్దాలు 500 సినిమాల్లో నటించారు. తోడుదొంగలు, అర్ధాంగి, ఏది నిజం, చిరంజీవులు, మాయింటి మహాలక్ష్మి, ఇల్లరికం, మాయాబజార్, కీలుబొమ్మలు, మహామంత్రి తిమ్మరుసు, హరిశ్చంద్ర, దొంగల్లో దొర, రాజమకుటం, మంచిమనసులు, మూగమనసులు, ఆత్మగౌరవం, ఇద్దరు మిత్రులు, అంతస్తులు, దసరా బుల్లోడు, ఈ చరిత్ర ఏ సిరాతో, గృహప్రవేశం, ఏకలవ్య, అల్లూరి సీతారామరాజు...ఇవన్నీ ఆయన చేసిన చిత్రాల్లో మణిమకుటాలు.

### ఎన్నో అవార్డులు.. రివార్డులు

గుమ్మడికి అయిదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. 1977లో భారత ప్రభుత్వం ఆయన్ను 'పద్మశ్రీ'తో సత్కరించింది. మహామంత్రి తిమ్మరుసులో నటనకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు. రఘుపతి వెంకయ్య అవార్డు, నంది అవార్డులు వరించాయి. 1963లో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ గౌరవ డాక్టరేటును ప్రదానం చేసింది. 2008లో జగద్గురు శ్రీకాశీనాయన చరిత్ర చివరి సినిమా. 2010 జనవరి 26న హైదరాబాద్‌లో కన్నుమూశారు. 2017లో తెనాలిలో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం నిర్మాణం పూర్తయ్యాక ప్రారంభోత్సవం రోజునే గుమ్మడి 90వ జయంతి వేడుకలను నిర్వహించారు. గుమ్మడి పేరిట కళాపురస్కారాన్ని ఇవ్వటం ఆరంభించారు. తొలి పురస్కారాన్ని రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణకు బహూకరించారు.

### పాత్రల్లోకి పరకాయ ప్రవేశం

తెలుగు సినిమా స్వర్ణయుగం (1950–70)లో నటుడుగా కళ్లుతెరిచిన అదృష్టవంతుడు గుమ్మడి. సాంఘిక, పౌరాణికం, జానపదం... ఇతివృత్తం ఏదైనా సరే, అందులో ఇట్టే ఇమిడిపోగల ఆంగికం, వాచకం, అభినయం ఈ నటరాజుకు మూడుకళ్లు. అక్కినేని, ఎన్టీఆర్‌తో సహా మూడుతరాల నటీనటులతో కలిసి నటించారు. బలరాముడు, భీష్ముడు, దశరథ, తిమ్మరుసు, పరశురాముడు, విశ్వామిత్రుడు, సత్రజిత్తు వంటి పౌరాణిక/చారిత్రక పాత్రలు, ముఖ్యమంత్రి, డాక్టరు, న్యాయవాది, మునసబు, పోలీసు అధికారి, ప్రిన్సిపాల్, తండ్రి పాత్రల్లోనూ జీవించారు. సినిమా రంగంలో ప్రవేశించటానికి తొలి ప్రేరణగా నిలిచిన ప్రముఖ రంగస్థల నటుడు మాధవపెద్ది వెంకట్రామయ్య, 'హీరోగా చేయటంలో రిస్క్ వుంది... కేరెక్టర్ ఆర్టిస్ట్ అయితే బాగుంటుంది' అని సలహానిచ్చిన త్రిపురనేని గోపీచంద్, ఆదాయానికి మించి ఖర్చు చేయొద్దని చెప్పిన ఎన్టీఆర్ మాటలను తు.చ. తప్పక పాటించారు. హేతువాదిగా, అంతకుమించి వాస్తవవాదిగా ఆయన గమనం, గమ్యం ఎప్పుడూ సత్యం వైపే. ఆయన జీవితం, అనుభవం




స్వస్థలంలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన స్మృతిచిహ్నం

తెలుగు సినిమా చరిత్రకు ఓ సంతకం

### తెలుగు సాహిత్యమంటే ప్రాణం

తొలినుంచీ తెలుగువారి తెల్లని పంచె, తెల్లని లాల్చీ ధరించి, అచ్చమైన, స్వచ్ఛమైన ఆంధ్రుడిలా కనిపించటం ఆయనకిష్టం. 13వ ఏటనుంచే ఖద్దరు దోవతి ధరించేవారు. తెలుగు సాహిత్యమన్నా ఆయనకు ప్రాణం. శరత్, చలం, గోపీచంద్, కొడవటిగంటి, బుచ్చిబాబు, రావిశాస్త్రి వంటి ఉద్దండుల రచనలన్నీ చదివారు. హాలీవుడ్ సినిమాలంటే గుమ్మడికి మక్కువగా చెబుతారు. ఆయనకు బాగా ఇష్టమైన సినిమా మాయాబజార్. ఆయనకు బాగా ఇష్టమైన పాత్ర మహామంత్రి తిమ్మరుసు. ఎప్పుడు స్వస్థలం వచ్చినా తెనాలిలోనే మకాం. రోజుల తరబడి ఇక్కడే పుస్తకాలు చదువుతూ స్నేహితులతో గడుపుతూ కాలక్షేపం చేసేవారు.

### నేడు డాక్టర్ సీతారామమ్మ బంగారు పతకం ప్రదానం

**తెనాలి:** తెనాలికి చెందిన ప్రవాస భారతీయ వైద్యురాలు డాక్టర్ వడ్లమూడి సీతారామమ్మ మెమోరియల్ గోల్డ్ మెడల్ ఎండోమెంట్ లెక్చర్ సమావేశం శుక్రవారం రాత్రి 8 గంటలకు ఐఎంఏ హాలులో జరగనుంది. ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకరబాబు గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్వీ సుందరాచారికి డాక్టర్ సీతారామమ్మ వడ్లమూడి మెమోరియల్ గోల్డ్‌మెడల్‌ను ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా 'స్పెక్ట్రమ్ ఆఫ్ మూవ్‌మెంట్ డిజార్డర్స్' అనే అంశంపై డాక్టర్ సుందరాచారి ప్రసంగిస్తారని తెలియజేశారు.

### యువకుడిపై రౌడీషీటర్ దాడి



దాడిలో గాయపడిన శ్రీరామ్ రాజు

**తెనాలిరూరల్:** యువకుడిపై రౌడీషీటర్ దాడిచేసి గాయపర్చిన ఘటన తెనాలిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద పట్టపగలే నడిరోడ్డుపై ఓ యువకుడిపై ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ నూతలపాటి అరుణ్ దాడి చేశాడు. మల్లెపాడుకు చెందిన శ్రీరామ్ రాజు ప్రకాశం రోడ్డులో ఏఎస్ఎన్ కాలేజీ సమీపంలో సమోసాల బడ్డీ పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. అతని భార్య లక్ష్మి నెహ్రూరోడ్డులో ఓ హాస్పటల్ వద్ద సమోసాలు బడ్డీ వ్యాపారం చేస్తోంది. అయితే శ్రీరామ్ రాజుకు ఈ మధ్యన ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ అరుణ్ పరిచయమై తరచూ తనను బండి మీద వేరే ప్రాంతంలో దింపమని అడుగుతున్నాడు. ఒకట్రెండు సార్లు దింపిన శ్రీరామ్ రాజు గురువారం తనకు కుదరదని చెప్పి మధ్యలో దింపేసి వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన రౌడీషీటర్ అరుణ్ యువకుడు రాజుపై పాతగవర్నమెంట్ హాస్పటల్ వద్ద దాడి చేశాడు. బండి తాళంతో రాజు చెవిలో పొడవడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావంతో తెనాలి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. యువకుడితో రౌడీషీటర్ వాగ్వాదం చేయడం, బండిపై వెళ్లడం వంటి దృశ్యాలు అక్కడ సీసీ కెమేరాల్లో రికార్డయ్యాయి. అకారణంగా తన భర్తపై దాడి చేశారంటూ యువకుడి భార్య వాపోయింది.

# అర్బన్ మార్కెట్‌ను ప్రోత్సహించండి

**మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక**



అర్బన్ మార్కెట్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

**తెనాలిఅర్బన్:** అర్బన్ మార్కెట్‌ను పట్టణవాసులందరూ పరిశీలించి వాటిలో విక్రయించే వస్తువులను కొనుగోలు చేస్తూ వారిని ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. మెప్మా విభాగం ఆధ్వర్యంలో మున్సిపల్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన వస్తువులను స్టాల్స్‌లో ఏర్పాటు చేసి విక్రయాలు జరిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో నెలకు రెండు రోజులు అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ దేవసేన, మెప్మా సీఎంఎం విజయ, పలువురు సీఓలు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు**

**తెనాలిఅర్బన్:** మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 25, 26 వార్డులలో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే మురుగు, పంట కాల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలోని వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అనేక వార్డులలో మురుగు సమస్యను పరిష్కరించేందుకు నూతన కాల్వలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, షేక్ ఇస్మాయేల్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీఓ సాంబశివరావు, ఏఈ సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

# రోటరీ క్లబ్ సమాజసేవ అభినందనీయం




అవార్డు గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

**2025 రోటరీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవ సభలో ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు.ఆర్.వడ్లమూడి**

**తెనాలి:** సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజలో ఉండటం అభినందనీయమని ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో వొకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డులు–2025 ప్రదానోత్సవం గురువారం రాత్రి సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి సమాజసేవ ఆవశ్యకతను తెలియజేశారు. ఉచిత వైద్యశిబిరాలు, మొక్కలు నాటటం, దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ సహా పలు నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపడుతున్న సంస్థను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావులు తమ ప్రసంగాల్లో రోటరీ సేవలను ప్రశంసించారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్.3150 డెప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు రోటరీ కార్యకలాపాలను వివరించారు. తెనాలి క్లబ్ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలను అభినందించారు. క్లబ్ తెనాలి కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, కోశాధికారి రమేష్‌కుమార్ జైన్ బన్సాలీ నివేదికను సమర్పించారు. సభలో వివిధ రంగాల్లోని నిబద్ధత కలిగిన ఉద్యోగులు, కళాకారులను 2025 రోటరీ ఎక్స్‌లెన్స్ అవార్డులతో సత్కరించారు.

– అవార్డులను అందుకున్నవారిలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్‌నర్స్ జల్లి జయశ్రీ, పెదరావూరుకు చెందిన పాలడుగు రంగయ్య, అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ పాలడుగు అంజయ్య, రంగస్థల కళాకారిణి ముత్యాల లక్ష్మీతులసి, పోస్టల్ ఉద్యోగి గోవాడ వెంకట అప్పారావు, ఏపీఎస్ ఆర్టీసీ ఎస్‌డీఐ వాలే రామారావు, తెనాలి మున్సిపాలిటీ శానిటేషన్ వర్కర్ తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. రోటరీ ప్రముఖులు ఈదర వెంకట పూర్ణచంద్, పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, నల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ డి.జీవనలత పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**తాడేపల్లిరూరల్:** బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ 3 దశాబ్దాలకు పైగా కార్మికులు న్యాయ పోరాటం చేస్తున్నా వారి సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. పాలక పక్షాలు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూరపాటి స్టీవెన్, అంకయ్య, ఆశీర్వాదం, ఇశ్రాయేలు, కె. ఆదినారాయణ, శివకుమారి, రమణ, దుర్గాభవాని, అన్నమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

### కొల్లిపర ఎస్సీ కాలనీకి స్మశాన స్థలం కేటాయించాలి



**కొల్లిపర:** మండల కేంద్రం కొల్లిపర గ్రామంలోని ఎస్సీ కాలనీకి స్మశాన స్థలాన్ని కేటాయించాలని, డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. కొల్లిపర ఎస్సీ కాలనీలో ఉన్న సమస్యలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజలు స్మశాన స్థలం చాలక పోవటం, అంతర్గత రోడ్డులలో డ్రైనేజీ , ఉపాధి హామీ పనులు సరిగా చూపించకపోవడం, కౌలు దారులకు రుణాలు ఇవ్వకపోడం తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చినారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ అధికారులు చొరవ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను మంజూరు చేయడం లేదని, దీనితో ఎస్సీ కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్వే కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.భావనారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట శేఖర్, నాయకులు దొప్పలపూడి రమేష్, జె.పవన్, పి.దిలీప్, పి.రవిచంద్రరావు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహాల జోలికొస్తే సహించం

**బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ మల్లికలు**



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మల్లికలు, సుబ్బారావు తదితరులు

**తెనాలిఅర్బన్:** భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కొందరూ రాజకీయ నాయకులు విమర్శించే స్థాయికి దిగజారి పోయారని, ఆయన జోలికి వస్తే సహించేది లేదని బహుజన సమాజ్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఆర్‌జె మల్లికలు, జిల్లా అధ్యక్షుడు కూరపాటి సుబ్బారావు హెచ్చరించారు. తెనాలి రజక చెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహ నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజక చెరువు వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే సమయంలో అడ్డుకునేందుకు యత్నించడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అంబేడ్కర్ ఒక కులానికి, మతానికి చెందిన వ్యక్తి కాదని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాజకీయ నాయకులు పనిచేయాలని కోరారు. బహుజనుల రాజ్యాధికారానికి యువత నడుం కట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ తెనాలి ఇన్‌ఛార్జి కారుమంచి సునీల్ సందీప్, నాయకులు అందె శ్యామ్, బొనిగల ప్రసాద్, సముద్రాల కన్నా, యనమద్రి శ్యామ్, కంచర్ల సుమన్, పిల్లి థిమోతి, వంపుగళ్ళ సురేష్, గుమ్మడి అనిల్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

**తెనాలిఅర్బన్:** రోడ్లపై వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. బోసురోడ్డులో గురువారం తెల్లవారుజామున ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న చెత్తసేకరణ పనులను పరిశీలించారు. సేకరించిన చెత్తను జిందాల్ సంస్థకు అప్పగించాలని సూచించారు. అలాగే మురుగు కాల్వలను కూడా పరిశీలించి వాటిని శుభ్రం చేయించారు. ఆమె వెంట పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# నిషేధం పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు

- నంగమేశ్వర ఆలయం సర్వీస్ ఈనామ్ భూముల రైతుల ఆవేదన
- తహసీల్దార్‌కు వినతిపత్రం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

**తెనాలి:** రూరల్ మండల గ్రామం సంగం జాగర్లమూడిలోని సంగమేశ్వర దేవాలయం సర్వీసు ఈనామ్ కింద నాటి జమీందారు ఇచ్చిన భూములను నిషేధిత జాబితాలో పేర్కొనటం అన్యాయమని, ఆ భూములపై నిషేధాన్ని తొలగించాలని కోరుతూ సంబంధిత రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గురువారం స్థానిక మండల తహసీల్దారును కలిసి సమస్యను వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. 1860లో టీడీ నెం.472 పట్టాలతో వ్యవసాయ భూములను అప్పటి సర్వీస్ ఈనామ్‌దారులకు ఇచ్చారు. 1956లో పార్లమెంటులో చేసిన ఈనామ్ అబాలిషన్ చట్టం ప్రకారం అప్పటికి ఈనామ్‌దారులుగా ఉన్నవారిని వ్యక్తిగత ఈనాములుగా గుర్తించి రైతుపట్టాలను ఇచ్చినట్టు పోతంశెట్టి కోటేశ్వరరావు చెప్పారు. 2013లో కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 310 జీఓలో పేర్కొన్న ఒక పదం కారణంగా తమ భూములు బ్లాక్‌లిస్టులోకి చేరాయన్నారు. సంగం జాగర్లమూడిలోని దాదాపు వందమంది రైతులకు చెందిన వంద ఎకరాలు అప్పటికే కొన్ని చేతులు మారాయని, ఎక్కువమంది రైతులు తగిన డబ్బును చెల్లించి, ప్రభుత్వ ఫీజులను ఇచ్చి, న్యాయబద్ధమైన దస్తావేజులతో కొనుగోలు చేశారు. సొంత పేరుతో పట్టాలను కలిగి సర్వహక్కులతో అనుభవిస్తున్నారని వివరించారు. మరికొన్ని భూములు ఇళ్లస్థలాలుగా మారాయని చెప్పారు. ప్రభుత్వ రికార్డుల్లోనూ రైతుల పేరుతోనే ఉందనీ, వారికి పట్టాదారు పుస్తకాలు కూడా ఉన్నాయని ఉండవరపు హరిబాబు తెలిపారు. కొన్నేళ్ల క్రితం ఈ భూములకు పట్టాదారుగా సంగమేశ్వర స్వామిని నమోదుచేశారనీ, అనుభవదారుగా రైతును పేర్కొన్నారని తెలిపారు. మళ్లీ కొంతకాలానికి ఏకపక్షంగా అనుభవదారు పేరు కూడా దేవుడి పేరిటే మార్చినట్టు వివరించారు. ప్రస్తుతం అవి నిషేధ భూముల జాబితాలో ఉండటంతో రైతులకు సమస్యలు నెలకొన్నట్టు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పాలడుగు ప్రసాదరావు వెల్లడించారు. బిడ్డల పెళ్లిళ్లకు కట్నాలుగా ఇచ్చిన భూములు ఉన్నాయనీ, అన్నదమ్ములు భాగాల కింద పంచుకున్నవి రిజిస్టరు కావటం లేదనీ, బ్యాంకులు రుణాలు మంజూరు చేయటం లేదన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టిసారించి తమకు న్యాయం చేయాలని కోరారు. వీరితో రైతులు ఆవుల కుప్పుస్వామి, వరుణబాబు, ఏడుకొండలు, కోటిరెడ్డి, చిన్నా, వెంకటేశ్వరరెడ్డి, రాగసుధ, శైలజ, శ్రీదేవి ఉన్నారు.